# వ్యాస కౌముది



## చాటువులు - దూర్వాసుల వేంకట సుబ్బారావు



### కలగలుపు చాటువులు

రకరకాల భాషల్లోని పదాలను ఛందోబంధంగా అనేకమంది కవులు"కలగలుపు చాటవులు"గా అందజేసారు. వీటినే మణి ప్రవాళలు అని అంటారు. నైజాము రాష్ట్రంలో తెలుగు, ఉర్దూ కలిపి ఒక అగ్రహారీకుడు తన నవాబుకి తన ఈతి బాధల్నిఇలా విన్నవించుకున్నాడు..

ఫలం లేదు మజ్కూర్, కలంబందు హల్ సాల్
అలం మోదుగాకుల్, క్వచిత్ టేకు మాకుల్;
అవుర్ కోయకొంపుల్, మరీ మాలకొంపల్
హ మే ముళ్ళ కంపల్. హమార్రేగ్రహరే

తుమాతా జవానుల్, హమార్రేగ్రహారే
కదాపిహదంగా, సజా సేయకుండన్
హుకుందియతాంనో, హకాంచాపి దర్యా
త్ఖురాతే ముదేస్తా త్వదా జంగలీశ!

ఇంకొక కవి సంస్కృతం తెలుగులను జోడించి తన బాధల్ని విన్నవించు కున్నాడు ఈ విధాన:

భోజనం ఈగ సంకీర్ణం
దోమ సంకీర్ణ మందిరమ్
శయనం నల్లి సంకీర్ణం
దేహమే కుంటి కూనమా!

పోతనగారి గునుగు పద్యం "ధరసింహాసనమై...." పంథాలో నేటి కవి కశ్చన వడ, ఆవడ, పకోటి, ఇడ్లీ, బొండా కాఫీ ఫలహారాల గురించి ఇలా అన్నాడు:

వడప్పై, నావడప్పై పకోడిపయి, హల్వా తుంటప్పై బూందియోం
పొడిప్పై, నుప్పిడిప్పై, రవిడ్లిలిపయిం, బోండాపయిన్, సేవియా

సుడిపై, చాలు భవత్కృపారసము నిబ్బో గొంతరానిమ్మనే

నుడుకుంగాఫిని మొక్కు గుక్కు గొనవే మో కుంభ దంభోధరా!

ప్రశ్నోత్తరాల రూపంలో కూడ కొన్ని చాటువులున్నాయి. 1750 ప్రాంతం వాడైన అడిదము సూరకవి చాల చమత్కారంగా తన గురించి ఇలా చెప్పుకున్నాడు:

ఊరెయ్యది? చీపురువలె

పేరో? సూరకవి; ఇంటిపే?రడిదము వార్

మీరాజు? విజయ రామ మ

హారాజతడేమి సరసుడా? భోజుడయా

జూపల్లి ధర్మారావుగారి గురించి 1854 లో ఇద్దరు భట్రాజులు (నీరపరాజు, సుపరాజు) ఇలాగే ప్రశ్నోత్తరాలలో ఇలా అన్నారు:

జూపల్లి దర్మరాయం

డేపాటి ధనంబొసంగె? నీరపరాజా!

పాపాత్ముడెవరికిని

జూపనిదె చూపెనయ్య సూరపరాజా!

ప్రభువులు సహాయం చేయకపోతే ఖచ్చితంగా, నిస్సంకోచంగా చాటువు రూపంలో తిట్టేవారు. మంచెళ్ళ కృష్ణయ్య (1848) ఈ క్రింది విధంగా తిట్టే వెంటనే సహాయం వచ్చి పడిందట!

ఇయ్యక చదివించుకొనే | కొయ్యలు నౌ లంజతొత్తు కొడుకులు దొరలా |

యియ్యగ నేరుతురర్థికి | వెయ్యారులు యాచభూప వినుత దిలీపా!

నలుగురుకవులు చేరి సమానంగా చెరి ఒక పాదం చెప్పిన చాటువు కూడ ఉంది దీన్లో ఆఖరి పాదం తెనాలి రామలింగనిది - అది చదివి కప్పుకునే శాలువాని తిమ్మన నుంచి పొందేడు.

1.వాకిట కావలి తిమ్మా

2.ప్రాకటముగ సుకవి వరుల పాలిటి సొమ్మా

3.నీకీ పద్యము కొమ్మా

4.నాకీ పచ్చడమెచాలు నయముగనిమ్మా

అష్టకష్టాలు పడుతూ తమ బాధల్ని కొందరు చాటుకున్నారు ఈ విధంగా

శీతల స్నానంబును

భూతల శయనంబు, నొంటిపూలు శనంబున్

నాతిగల బ్రహ్మచర్యము

నాతరమా! పూట గడప నారయ భూపా!

కావేటి రంగధామునికి ఇలా మొఱపెట్టుకున్నారు తమ ఈతి బాధల్ని:

అరయబరదేశ యాత్ర సేయుట యొండు, తనకు తానే వండుకొనుట రెండు
కులపతి నెడబాసి తొలిగిపోవుట మూడు, వెలయంగ యాచక వృత్తి నాల్గు
తన సరివారి పంచను జేరుకొనుటైదు, గుఱుతెఱంగని రాజు గొల్చుటారు
చదువు నేరక యుండి సభకు బోవుట ఏడు, నెన్న దారిద్ర్యంబు నెన్మిదవది

అష్టకష్టంబులని యెడు నవ్వి యివ్వి
గానయిటువంటి వెవ్వరికైన వలదు
చారుతరమూర్తి! దేవతా చక్రవర్తి
రమ్య గుణ ధామ! కావేటి రంగధామ!

పుల్లకవి తన ప్రభువు ఎంత ఔదార్యశీలుడో వెటకారంగా ఈ చాటువును చెప్పేడు:

ఇచ్చె ఇచ్చెను దొరయేమిచ్చెనంటిరా, ఈ ఊరిలో నుండనిచ్చినాడు
పొరుగూళ్ళ వెంబడి పోయి ముష్టెత్తుక, ఇంటికి తిరిగి రానిచ్చినాడు
గ్రాసాన కోక వేళ కలిగి లేకుండిన, నిట్టింట పస్తుండ నిచ్చినాడు
చలి వేళ కప్పుకో చట్ట లేకుండినా, చేతులు ముడుచుకోనిచ్చినాడు
------
ఇట్టి యన్యాయము కేడ్వ నిచ్చినాడు
మేలు మేలెట్టి గుణము నిర్మించాడు
పుల్లకవి నేలు గోపికా వల్లభుండు

చాలామంది కవులు తమ రాజుల్ని, దాతలిని అదే పనిగా ఇంద్రుడు చంద్రుడు అని గగనానికి ఎత్తేసేవారు. ఇరవై శతాబ్దంలో పండిత ప్రకాండులు, కవి పుంగవులలో నగ్రగణ్యులు తిరుపతి వేంకట కవులు. వీరు అష్టావధానం విజయనగరంలో చేయాలన్న ఉద్దేశంతో ఆనందగజపతుల వారిని 25 చాటవుల్లో పొగిడారు మచ్చుకి:

రాజు రాజనగనే రాజాయనే చంద్రు,డల రాజశేఖరు నాశ్రయించె
రాజు రాజనగనే రాజాయనే ఇంద్రు,డర్యమాత్మజుని దానడిగి కొనియె
రాజరాజనగనే రాజరాజాకుబే,రుడు? కిం నరేశ్వత రూఢిగాంచె
రాజ రాజననే రాజ రాజా సుయోధనుడధి కర్ణత్వమునుగమించె
రాజనిన రజ రాజున్న రాజులందు
నీకు తగుగాక యన్యులా లోకపతుల
కొకరికైనను జెల్లునే? యుర్విలోన
విజయ నగర మహారాజ! విపుల తేజ.

***

(కొనసాగింపు వచ్చేనెలలో)